క్లుప్తంగా

ఆధార్ కేంద్రం పునరుద్ధరణ

తిరువూరు: స్థానిక సబ్ పోస్టాఫీసులో ఆధార్ సేవలను పునరుద్ధరించామని పోస్ట్ మాస్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. గతంలో తమ పోస్టాఫీసులో ఉన్న ఆధార్ కేంద్రాన్ని సాంకేతిక కారణాలతో నిలిపివేశామని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మళ్లీ ఆధార్ డేటా మార్పుచేర్పులు, కొత్త కార్డుల జారీ, సవరణ తదితర సేవలు ప్రవేశ పెడుతున్నామన్నారు. ప్రజలు ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామ సభ వాయిదా

తిరువూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని రామలింగేశ్వరాలయం పునరుద్ధరణ పనులు చేపట్టే విషయమై దేవదాయ శాఖ శనివారం నిర్వహించాల్సిన గ్రామ సభను వాయిదా వేశారు. ఆలయ ధర్మకర్తల మండలికి సమాచారం లేకపోవడం, గ్రామస్తులు పరిమిత సంఖ్యలో మాత్రమే సమావేశానికి హాజరుకావడంతో ప్రతిపాదనలను ఆమోదించకుండా మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని దేవదాయ శాఖ మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ. సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని తిరువూరు రోడ్డు, పెద్ద గాంధీబొమ్మ సెంటర్, చిన్న గాంధీబొమ్మ సెంటర్, బ్యాంకు స్ట్రీట్, ఎంప్లాయీస్ కాలనీ, పొట్టిశ్రీరాములు బొమ్మ సెంటర్, జంక్షన్‌రోడ్డు, అమ్మవారితోట, మొఘల్ చెరువు, ఆర్ఆర్‌పేట, ఆటోనగర్, అయ్యప్పస్వామి టెంపుల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని వివరించారు.

నేడు కాపుల ఆత్మీయ సమావేశం

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కాపు నేతల ఆత్మీయ సమావేశం ఆదివారం సాయంత్రం జరుగుతుందని పార్టీ యువజన విభాగం పట్టణ ఉపాధ్యక్షుడు వాళ్ల సురేష్ తెలిపారు. తిరువూరు, గంపలగూడెం, ఏకొండూరు, విస్సన్నపేట మండలాల కాపు నేతలు బైపాస్‌రోడ్డు సూర్య రెస్టారెంట్ ఆవరణలో జరిగే సమావేశంలో పాల్గొనాలని కోరారు.

24 నుంచి నియోజకవర్గ క్రీడా పోటీలు



తిరువూరు: ఈ నెల 24 నుంచి తిరువూరు నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తామని రెవెన్యూ డివిజనల్ అధికారి మాధవి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓలు, ఎంఈఓలు, వ్యాయామోపాధ్యాయులతో సమావేశం నిర్వహించిన ఆర్డీఓ ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణపై షెడ్యూలు విడుదల చేసిన అనంతరం సూచనలిచ్చారు. 24న స్త్రీ, పురుషుల ఖోఖో, వాలీబాల్ పోటీలు, 25న కబడ్డీ, 27 నుంచి 29 వరకు క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని వివరించారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగికి ఆర్థిక సాయం అందజేత



విస్సన్నపేట: స్థానిక వికాస్ ఫార్మసీ కళాశాలలో అటెండర్‌గా పని చేస్తున్న జొరిగే శ్రీనివాసరావు గుండె సంబంధిత ఆపరేషన్ చేయించుకోవడంతో తమ వంతు సాయంగా శనివారం వికాస్ విద్యాసంస్థల అధినేత నరెడ్ల నర్సిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు రూ.1,04,560 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వికాస్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాసరావు, వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా కులగణన

- డిజిటల్ విధానంలో యాప్ ద్వారా సర్వే
- నియోజకవర్గంలో 75,092 కుటుంబాలు
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- అధికారుల నిరంతర పర్యవేక్షణ



కొండపల్లిలో కులగణనకు ఓ కుటుంబం నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న సచివాలయ ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే మైలవరం నియోజకవర్గంలో ప్రతిష్టాత్మంగా జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా కులాల సంఖ్య తెలుసుకోవడం, ఆయా కులాలకు ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు రూపకల్పన చేయడం తదితర అంశాల ఆధారంగా ప్రభుత్వం సర్వే ప్రారంభించింది. వార్డు, గ్రామ వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా డిజిటల్ విధానంలో సర్వే చేస్తున్నారు. మైలవరం నియోజకవర్గం పరిధిలో సుమారు 75,092 కుటుంబాల వివరాలు కులాల ప్రాతిపదికన ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ, బీసీ, సాంఘిక సంక్షేమ శాఖలతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ, జిల్లా ఉన్నతాధికారులు సర్వేపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు.

డిజిటల్ విధానంలో కుల గణన..

శిక్షణ పొందిన సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా ఈనెల 19 నుంచి సర్వే ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి డిజిటల్ విధానంలో బయోమెట్రిక్ ద్వారా పారదర్శకంగా కులగణన సర్వే చేపట్టారు. ఇప్పటికే క్లస్టర్ పరిధిలో యాప్‌లో పొందుపర్చిన కుటుంబ సభ్యుల వివరాలు క్రోడీకరించుకుని సర్వేకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలపై ఒత్తిడి లేకుండా సర్వే చేస్తున్నారు. కుటుంబంలో ఒక వ్యక్తి ఈకేవైసీ ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలు, పేర్లు, కులం, ఉప కులం, ఆస్తి వివరాలు, నివాస గృహం, కుటుంబంలో కొత్త వ్యక్తుల పేర్లు, జెండర్, ఉద్యోగం, వ్యక్తిగత వివరాలు, జీవన స్థితిగతులు, పశు సంపద, రేషన్‌కార్డు నంబర్, మరణించిన వారి వివరాలతో పాటు యాప్‌లో నమోదు కాని వారి పేర్లు నమోదు చేస్తున్నారు. జీవనోపాధి కోసం పొరుగూరు వెళ్లిన వారి వివరాలు ఫోన్ ఓటీపీ ఆధారంగా నమోదు చేస్తున్నారు. ఈనెల 28వ తేదీ వరకు కులగణన సర్వే జరుగనుందని అధికారులు తెలిపారు.

బహుళ ప్రయోజనాలు..

రాష్ట్ర ప్రజలకు ప్రస్తుతం అమలవుతున్న నవరత్న పథకాలతో పాటు మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం కులగణన సర్వే చేపట్టింది. గ్రామాలు, పట్టణాల్లో చేపడుతున్న కులగణనతో ప్రజలకు బహుళ ప్రయోజనం కలుగుతుంది. కులగణనతో ప్రజల అభ్యున్నతికి అవసరమైన నూతన పథకాలు రూపకల్పన చేసేందుకు ప్రభుత్వానికి అవకాశం ఉంటుంది. కులాల వారీగా ప్రజలు రాజకీయ, సామాజిక, ఆర్థిక పరమైన ప్రయోజనాలు అందిపుచ్చుకోవచ్చు. ప్రయోగాత్మకంగా సర్వే పూర్తయిన తర్వాత సంక్షేమ పథకాల అర్హుల వివరాలు, ఇప్పటికే వారు పొందిన లబ్ధి ప్రభుత్వం వద్ద నిక్షిప్తం అవుతుంది. సర్వే ఆధారంగా సంక్షేమ పథకాలు అందుకునేందుకు పేదలకు మార్గం సుగమం అవుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం చేపట్టిన కులగణనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. సర్వే ద్వారా కులాల ప్రాతిపదికన నిర్దిష్ట సంఖ్య ప్రభుత్వం వద్ద ఉంటుంది. ఆయా కులాలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ పరమైన అంశాలు రూపకల్పన చేసేందుకు ప్రభుత్వానికి అవకాశం ఉంటుంది. ప్రజలకు ఉపయోగపడే సర్వే సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పారదర్శకంగా చేపట్టాలి.

– రామకృష్ణనాయక్, ఎంపీడీఓ, ఇబ్రహీంపట్నం

అభివృద్ధిలో టెక్నాలజీ పాత్ర కీలకం



ల్యాబ్‌ను ప్రారంభించిన రామకృష్ణ, లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి తదితరులు

మైలవరం: ఆధునిక టెక్నాలజీతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని, అభివృద్ధిలో టెక్నాలజీ పాత్ర కీలకమని విజయవాడ ఎఫ్టానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ డి. రామకృష్ణ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని మెకానికల్ బ్లాక్‌లో సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ల్యాబ్‌ను రామకృష్ణ, కళాశాల గౌరవ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి, ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి శనివారం ప్రారంభించారు. మన దేశం అభివృద్ధి చెందటానికి టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగించుకోవాలి అనే అంశంపై విపులంగా వివరించారు. అందరూ అభివృద్ధి చెందిన దానిని మాత్రమే ఉపయోగిస్తున్నారని, అలా కాకుండా ఇంకా నూతనంగా ఆలోచించి విద్యార్థులు అందరికీ ఉపయోగపడే కొత్త కొత్త ఆవిష్కరణలు చేయాలని సూచించారు. కళాశాల గౌరవ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో అన్ని పరిశ్రమలు ఆటోమేషన్ బాట పడతాయని, వీటి ద్వారా ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీర్‌కు మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. త్రీ డీ ప్రింటింగ్, ఐఓటీ టూల్స్ అండ్ డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్ వంటి యంత్రాలను విద్యార్థుల నూతన ఆవిష్కరణలు పొందుపరిచేందుకు ఈ ల్యాబ్‌ను రూపొందించామన్నారు. అనంతరం ఎల్‌బీఆర్‌సీఈ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రోల్ ఆఫ్ టెక్నాలజీ టూ మేక్ ఇండియా ఏ డెవలప్డ్ కంట్రీ అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్, డీన్స్, వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి. శివహరిప్రసాద్, ఎస్. ఉమామహేశ్వరరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో కీర్తి, ఆరోగ్యం



ఆగిరిపల్లిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ చంటిబాబు, హెచ్ఎం పుష్పలత

ఆగిరిపల్లి: క్రీడలపై ఆసక్తి చూపితే కీర్తితో పాటు ఆరోగ్యం, మానసిక పరిస్థితి మెరుగవుతుందని ఎస్ఐ నంబూరు చంటిబాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలో ఆగిరిపల్లి–2 సచివాలయ జట్టు నరసింగపాలెంపై గెలుపొందింది. వాలీబాల్ ఫైనల్ పోటీలో ఈదర జట్టు ఈదులగూడెంపై విజయం సాధించింది. విజేతలకు ఎస్ఐ చంటిబాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని పుష్పలత, పీఈటీ నాగేంద్రం పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



నూజివీడులో కబడ్డీలో తలపడుతున్న మీర్జాపురం- ఎంఎన్‌పాలెం జట్లు



వాలీబాల్ పోటీల్లో షాట్ కొడుతున్న యనమదల జట్టు క్రీడాకారుడు



మైలవరంలో క్రీడా పోటీల విజేతలతో ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి తదితరులు

నూజివీడు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ఈనెల 10న ప్రారంభమైన పోటీలకు సంక్రాంతి పర్వదినం మూడు రోజులూ సెలవులు ఇవ్వగా ఆ తరువాత నుంచి నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, క్రికెట్, షటిల్, వాలీబాల్ క్రీడలను మండల స్థాయిలో నిర్వహించారు. పట్టణంలోని డీఏఆర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన పోటీలను ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ పర్యవేక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికి తీయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 15 ఏళ్ల వయస్సు పైబడిన వారికి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోంది. గత నెల 26 నుంచి జనవరి 6 వరకు సచివాలయ స్థాయిలో పోటీలు. ఈనెల 24 నుంచి నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను నిర్వహించనున్నారు. నూజివీడు పట్టణం, మండలంలో పురుషుల విభాగంలో షటిల్‌లో సమతానగర్ జట్టు, ఖోఖోలో సిద్ధార్థనగర్, కబడ్డీలో పాతపేట, వాలీబాల్‌లో యనమదల, క్రికెట్‌లో బాపూనగర్, షటిల్‌లో సమతానగర్ జట్లు విజయం సాధించి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. అలాగే మహిళల విభాగంలో షటిల్‌లో పాతపేట జట్టు, ఖోఖోలో యనమదల జట్టు, క్రికెట్‌లో ఎంప్లాయీస్ కాలనీ–1 నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. వ్యాయామోపాధ్యాయులు పి. రవీంద్ర, లక్ష్మీ, రాజేంద్రప్రసాద్, వనజ, సరళ, ఆదర్శ్, ఆరతి, పుల్లారావు, స్వప్న, రాజేశ్వరి, రాణి తదితరులు పాల్గొన్నారు.

మైలవరం మండల స్థాయి విజేతలు..

మైలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం విజయవంతంగా ముగిశాయి. మైలవరం మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్ స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి స్టేడియంలో జరిగాయి. క్రికెట్ పురుషులు విభాగంలో వెల్వడం ప్రథమ స్థానంలో, పుల్లూరు ద్వితీయ స్థానంలో నిలిచింది. మహిళల జట్టు పోటీలో లేదు. ఖోఖో పురుషుల విభాగంలో మైలవరం ప్రథమ, పుల్లూరు ద్వితీయ స్థానంలో నిలిచాయి. మహిళల ఖోఖోలో మైలవరం–2 ప్రథమ స్థానం, మైలవరం–3 ద్వితీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్ పురుషుల విభాగంలో కీర్తిరాయునిగూడెం ప్రథమ, మైలవరం–2 ద్వితీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్ మహిళల విభాగంలో మైలవరం –2 ప్రథమ, తోలుకోడు ద్వితీయ స్థానం దక్కించుకున్నాయి. పురుషుల బ్యాడ్మింటన్‌లో మైలవరం–3 ప్రథమ, మైలవరం–5 ద్వితీయ స్థానంలో నిలిచాయి. మహిళల బ్యాడ్మింటన్‌లో మైలవరం–1 ప్రథమ, మైలవరం–4 ద్వితీయ స్థానం, పురుషుల కబడ్డీ విభాగంలో వెల్వడం–2 ప్రథమ, చంద్రగూడెం–1 ద్వితీయ, కబడ్డీ మహిళల విభాగంలో మైలవరం–2 ప్రథమ, మైలవరం–4 ద్వితీయ స్థానంలో నిలిచారు. క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో 7 టీమ్‌లు పాల్గొన్నాయి. పుల్లూరు–2 వర్సెస్ వెల్వడం –1 మధ్య పోటీ జరిగింది. మొదటి బ్యాటింగ్ పుల్లూరు– 60 రన్స్ చేశారు. సూపర్ ఓవర్‌లో వెల్వడం–1 7 పరుగులు చేయగా పుల్లూరు–2 4 పరుగులకు మాత్రమే చేసి ఓటమి పాలైంది. విజేతలకు ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి బహుమతులు అందజేశారు.

ఎ..కొండూరు: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. కబడ్డీలో బాలురు పోలిశెట్టిపాడు, బాలికలు రామచంద్రాపురం, బ్యాడ్మింటన్‌లో బాలురు కంభంపాడు, బాలికలు ఏ.కొండూరు, వాలీబాల్‌లో బాలురు ఏ.కొండూరు తండా, బాలికలు కంభంపాడు–1, ఖోఖోలో బాలురు కంభంపాడు–1, క్రికెట్‌లో బాలురు ఏ.కొండూరు మండల స్థాయిలో విజేతలుగా నిలిచారు. గెలుపొందిన టీమ్‌లు ఈనెల 24వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయిలో తిరువూరులో జరిగే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొంటారని ఎంపీడీఓ రవికాంత్ తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



షటిల్ విజేత చెక్కపల్లి జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ముసునూరు: ముసునూరు హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. విజేతల వివరాలను ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. కబడ్డీ పోటీల్లో గుళ్లపూడి జట్టుపై అక్కిరెడ్డిగూడెం జట్టు విజయం సాధించగా, వాలీబాల్ పోటీల్లో రమణక్కపేట, ముసునూరు–1 జట్లు నియోజకవర్గ స్థాయి పోరుకు సిద్ధమయ్యాయి. షటిల్ బాడ్మింటన్ పోటీల్లో చెక్కపల్లి టీమ్ సభ్యులు డానీ, నాగరాజు విజేతలు కాగా చింతలవల్లి టీమ్ ద్వితీయ స్థానం సాధించింది. ఖోఖోలో ముసునూరు–1 ప్రథమ, చింతలవల్లి ద్వితీయ స్థానాలు సాధించాయి. మహిళల విభాగం వాలీబాల్ పోటీలో ముసునూరు–2 జట్టు విజేతగా నిలువగా, షటిల్ పోటీలో చింతలవల్లి ప్రథమ, వలసపల్లి ద్వితీయ స్థానాలు సాధించాయి. విజేతలకు శనివారం సాయంత్రం నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బహుమతులు అందజేశారు. పీడీలు ఆలీ, సుకుమార్, నాగరాజు నాగమల్లేశ్వరమ్మ, ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకుడు సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

22న మద్యం, మాంసం విక్రయాలు బంద్ చేయాలి

తిరువూరు: అయోధ్య రామమందిరంలో ఈ నెల 22న విగ్రహ ప్రతిష్ట జరుగనున్న నేపథ్యంలో తిరువూరు డివిజన్‌లో మద్యం దుకాణాలు, మాంసం దుకాణాలను మూసివేసే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం రెవిన్యూ డివిజనల్ అధికారి మాధవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని తిరువూరులో కూడా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నందున మద్యం, మాంసం విక్రయాలను నిషేధించాలని వారు కోరారు.

ఫిబ్రవరి 3న న్యాయ సేవలపై అవగాహన




మాట్లాడుతున్న 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ

నూజివీడు: పిల్లలకు స్నేహపూర్వక న్యాయసేవలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలు తదితర అంశాలపై ప్రజలను చైతన్యపరిచేందుకు ఫిబ్రవరి 3న నూజివీడులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ అన్నారు. పట్టణంలోని 15వ అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆవరణలో శనివారం అధికారులు, బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయ వాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లల హక్కులు, అందుబాటులో ఉన్న పిల్లల రక్షణ, సేవలు, పథకాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించేలా స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసీం, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. వెంకటేశ్వరరావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. హరిబాబు, స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ సెక్రటరీ ఎం.మధు రవిశంకర్, భారత్ బార్ అధ్యక్షుడు గోవాడ నీలాంబరం, సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ తేజోమణి, పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్వై నూరాణి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె. శ్యామ్‌బాబు, ఏఎస్‌డబ్ల్యూఓ డి. శ్రీనివాసరావు, ఏబీసీడబ్ల్యూఓ ఆర్.రవిప్రసాద్, ఎస్ఈబీ ఎస్ఐ మురళీధర్, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

23న చీమలపాడులో గ్యార్వి షరీఫ్ పండుగ

ఏ.కొండూరు: చీమలపాడు గ్రామంలోని ఏఏఎంటీకే దర్బార్‌లో ఈనెల 23న గ్యార్వి షరీఫ్ పండుగ జరుగుతుందని దర్బార్ పీఠాధిపతి మొహమ్మద్ ఖాజా మొహిద్దీన్ షా తాజ్ ఖాదరి తెలిపారు. శనివారం ఖాజా మొహిద్దీన్ విలేకరులతో మాట్లాడుతూ ముఖ్య అతిథిగా ఇరాక్ దేశంలోని బాగ్దాద్ షరీఫ్ పీఠాధిపతులు సయ్యద్ హాషిముద్దీన్ హాజరవుతారని చెప్పారు. హైదరాబాద్‌లో సయ్యద్ హాషిముద్దీన్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేసి కార్యక్రమానికి ఆహ్వానించామని చెప్పారు. పండుగ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

సొంత నిధులతో రహదారి పనులు ప్రారంభం



చౌటపల్లి(తిరువూరురూరల్): గత ప్రాదేశిక ఎన్నికల్లో గ్రామస్తులకు ఇచ్చిన మాటను తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి నిలబెట్టుకున్నారు. చౌటపల్లి పంచాయతీ పరిధిలో టేకులపల్లి వరకు రహదారి నిర్మిస్తానని హామీ ఇచ్చిన జెడ్పీటీసీ సభ్యుడు తన సొంత ఖర్చుతో రహదారి నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. టేకులపల్లి నుంచి చౌటపల్లి వరకు రాకపోకలకు వీలుగా ఈ రహదారి నిర్మాణం జరుపుతున్నామని, సుమారు రూ.6 లక్షలు ఖర్చవుతుందని ఆయన చెప్పారు. సర్పంచి రాజేశ్వరి పాల్గొన్నారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

ఆగిరిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈఓపీఆర్డీ శేఖర్ గ్రామ పంచాయతీ ప్రణాళిక, మండల పరిషత్ ప్రణాళిక ఏ విధంగా తయారు చేయాలి, గ్రామ, మండల స్థాయిలో ఆన్‌లైన్ ఏ విధంగా చేయాలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఏఓ అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

నూజివీడు: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నూజివీడు మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాస కుమార అప్పారావు అన్నారు. మండలంలోని యనమదల, బత్తులవారిగూడెంలలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లు, ఉపాధిహామీ పథకం తదితర వాటిని వివరించారు. ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్, ఈఓపీఆర్డీ సరస్వతి, వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి, ఉపాధిహామీ పథకం ఏపీఓ సోమేశ్వరి, దిగవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బి. సునందాకుమారి, బత్తులవారిగూడెం సర్పంచి ముసునూరి లక్ష్మీకాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

- **రేపు రామ నామ జపంతో ర్యాలీ**

మైలవరం: అయోధ్యలో సోమవారం నిర్వహించనున్న రాములోరి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని మైలవరంలో అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు రామకృష్ణ కాలనీ ఆంజనేయస్వామి గుడి నుంచి రామనామ జపంతో రాముల వారి ఉత్సవం (ర్యాలీ) జరుగుతుందని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తమ ఇంటి నుంచి జ్యోతిని తీసుకొని రామకృష్ణ కాలనీ గుడి తిరువూరు రోడ్డు ఆంజనేయస్వామి గుడి నుంచి జరిగే ఈ ఉత్సవంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

- **ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష**

నూజివీడు: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో శనివారం జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 316 మంది విద్యార్థులకుగాను 158 మంది పరీక్షకు హాజరైనట్లు హెచ్ఎం బీ హేమలత తెలిపారు. ఇంగ్లీషు మీడియం విద్యార్థులందరూ హాజరవ్వగా, తెలుగు మీడియం విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించారు.

- **కులగణన ప్రారంభం**

తిరువూరురూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరువూరు మండలంలో శనివారం కులగణన ప్రారంభమైంది. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలను నమోదు చేస్తున్నారు. రోలుపడి, ఆంజనేయపురం, మునుకుళ్ళ, అక్కపాలెం, వావిలాల, కోకిలంపాడు, లక్ష్మీపురం, మల్లేల గ్రామాల్లో జరిగిన కులగణన ప్రక్రియను ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు పరిశీలించారు.

- **పక్కాగా కులగణన సర్వే**



ఆగిరిపల్లిలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉదయభాస్కర్

ఆగిరిపల్లి: కులగణన సర్వేను పక్కగా చేపట్టాలని తహసీల్దార్ ఉదయ్ భాస్కర్ అన్నారు. ఆగిరిపల్లిలో శనివారం చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ సంక్షేమ పథకాల అమలులో, ప్రభుత్వ పౌర సేవలలో కుల ధ్రువీకరణ సర్వే సమాచారం కీలకం కానుందన్నారు. మండల వ్యాప్తంగా 19 సచివాలయ గ్రామాలలో సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. తప్పులు లేకుండా పక్కాగా సర్వే చేయాలని వలంటీర్లు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. నెక్కలం గొల్లగూడెంలో కులగణన సర్వేను ఈఓపీఆర్డీ శేఖర్ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.